నేడు సాలూరులో మెగా జాబ్‌మేళా

పార్వతీపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేడు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణచైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ ఏదైనా డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు, 18-28 సంవత్సరాల లోపు వారు హాజరుకావొచ్చన్నారు. 25 కంపెనీలకు చెందిన ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 94947 77553 73825 59022 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ముగ్గుల పండుగ

- 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీకి విశేష స్పందన
- పార్వతీపురంలో నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, యువతులు

రంగవల్లులతో జిల్లా కేంద్రం కొత్త శోభను సంతరించుకుంది. ముచ్చట గొలిపే ముగ్గులతో సప్తవర్ణ శోభితమైంది. ఇంద్ర ధనస్సు నేలకు వాలిందా అన్న చందంగా మారింది. జిల్లా నలమూలల నుంచి తరలివచ్చిన మహిళలతో ఆ ప్రాంతం కళకళలాడింది. రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో పండగ ముందే వచ్చినట్లయ్యింది. సంక్రాంతి కళ ఉట్టిపడింది. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. "ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)" సహకారం అందించాయి. యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. విభిన్న రంగులతో రంగవల్లికలను తీర్చిదిద్ది.. నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు అందుకున్నారు.

- పూర్తి వివరాలు ఆరోపేజీలో..



పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు



ప్రథమ స్థానం: ముగ్గు వేస్తున్న జి.కృష్ణవేణి



ద్వితీయ స్థానం: రంగవల్లి తీర్చిదిద్దిన కె.పవిత్ర



తృతీయ స్థానం: ముగ్గును అలంకరిస్తున్న వి.అరుణ

కష్టపడి కాదు..ఇష్టపడి చదవండి

- విద్యార్థులకు మంత్రి సంధ్యారాణి సూచన
- సాలూరు జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

సాలూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కష్టపడి కాదు...ఇష్టపడి చదువుకోవాలని, ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భగా విద్యార్థులకు వడ్డించి.. వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ' గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తే.. వైసీపీ ప్రభుత్వ దానికి మంగళం పాడేసింది. కూటమి ప్రభుత్వం విద్య వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తోంది. మంత్రి నారా లోకేష్ పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటికే రూ.28 కోట్లు మంజూరు చేశారు. ఈ పథకం వల్ల జిల్లాలోని 14 జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 5,800 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి సాలూరులో బాలికల జూనియర్ కళాశాల ప్రారంభిస్తాం. బోధనా విధానాన్ని మెరుగుపరిచేందుకు జిల్లా రీజనల్ స్థాయిలో అకడమిక్ గైడెన్స్ అండ్ మానటరింగ్ సెల్‌లను ఏర్పాటు చేస్తాం.' అని తెలిపారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం ద్వారా బలవర్ధక పౌష్టికాహారాన్ని తీసుకుని విద్యలో రాణించాలన్నారు. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా వృత్తి విద్య అధికారి వి.మంజుల వీణ, కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్, టీడీపీ నాయకులు తిరుపతిరావు, చంద్రశేఖర్ , అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

వయసుకు తగ్గ బరువు ఉండాలి

- చిన్నారులు అలా లేకుంటే చర్యలు
- సీడీపీవోలకు కలెక్టర్ హెచ్చరిక

పార్వతీపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండాలని లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సీడీపీవోలను హెచ్చ రించారు. ప్రతి కేంద్రంలో శతశాతం హాజరు ఉండాలన్నారు. భోజనం సమయానికి పిల్లలు కేంద్రానికి వచ్చేలా చూడాలని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికా రులతో మాట్లాడుతూ.. ఏడాది దాటిన పిల్లలకు ప్రతి ఆరు నెలలకొకసారి ఆల్‌బెండాజోల్ మాత్రలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండాలని తెలిపారు. బాగా పనిచేసిన అంగన్‌వాడీ వర్కర్ల పేర్లను గణతంత్ర దినోత్సవ అవార్డులకు ప్రతిపాదించాలని ఐసీడీఎస్ పీవోను ఆదేశించారు. బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పథక సంచాలకులు టి.కనక మహాలక్ష్మి, వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు, జిల్లా శిశు సంర క్షణ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

8లో

- 7వ తేదీ నుంచి నిర్వహణ
- ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెల్లడి

మా భూములు కాపాడండి

8లో

- బొబ్బిలి మండలం కాశిందొరవలస గ్రామస్థుల ఆందోళన

ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు

8లో

- పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు
- పట్టణంలో పలు షాపుల తనిఖీ
- అపరాధ రుసుం విధింపు

మూడు లక్షలకు పైబడే రుణగ్రస్థులు



- అప్పుల ఊబిలో జిల్లావాసులు
- పిల్లల చదువు కోసం కొందరు..
- వ్యవసాయ పెట్టుబడులు, ఇతరత్రా అవసరాలకు మరికొందరు
- ఈఎంఐలతో తిప్పలు.. తిరిగి చెల్లించలేక అవస్థలు

పార్వతీపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లావాసుల్లో అత్యధికులు రుణ భారంతో సతమతమవుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొందరు.. పిల్లల చదువులు, వ్యవసాయం తదితర అవసరాల కోసం మరికొందరు అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నారు. తలకు మించిన అప్పులతో రుణగ్రస్థులుగా మారుతున్నారు. అయితే గతంతో పోలిస్తే ప్రైవేట్ వ్యక్తుల వద్ద రుణాల తీసుకునే వారి సంఖ్య బాగా తగ్గింది. బ్యాంకుల్లో తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తుండడంతో జిల్లావాసులు అటువైపు మొగ్గుచూపుతున్నారు. ఆస్తులను ష్యూరిటీగా పెట్టి కొంతమంది.. బంగారు ఆభరణాలను కుదవ పెట్టి మరికొంతమంది రుణాలు పొందుతున్నారు. అయితే అవసవరాల కోసం అప్పులు చేస్తున్న వారు తిరిగి చెల్లించే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్య సమస్యలు.. ఆదాయం పెరగకపోవడం.. పంట నష్టాలను చవిచూడడం తదితర కారణాలతో సకాలంలో ఈఎంఐలను చెల్లించలేకపోతున్నారు. ఇదే సమయంలో వారిపై అధిక వడ్డీభారం కూడా పడుతోంది. కారణాలు ఏమైనా జిల్లాలోని సుమారు మూడు లక్షల పైబడి ప్రజలు అప్పుల ఊబిలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.



పిల్లల చదువు కోసం ...

పిల్లల ఉన్నత విద్య రుణాల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులే కాదు సామాన్య, మధ్యతరగతి వర్గీయులు ఎంతోమంది బ్యాంకుల ఎదుట క్యూ కడుతున్నారు. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర ఉన్నత విద్య కోసం జిల్లావాసులు బ్యాంకు రుణాలు పొందుతున్నారు. అయితే పిల్లల చదువులు పూర్తయిన తర్వాత వారు ఉద్యోగాలు చేయకపోయినా తప్పనిసరిగా వాయిదాలు కట్టాల్సి వస్తోంది. సకాలంలో ఈఎంఐ చెల్లించని పక్షంలో ఓ వైపు అధిక వడ్డీ భారం పడు తుండగా.. మరోవైపు బ్యాంకుల నుంచి ఒత్తిడి ఎదుర్కోలేక జిల్లా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల విద్య రుణాల కోసం బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. అయితే కొంత కాలం వరకు సక్రమంగానే ఈఎంఐలు చెల్లిస్తున్నారు. ఆ తర్వాత ఆర్థిక పరిస్థితులు అనుకూలించక.. రుణాలు తిరిగి చెల్లించలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

వివిధ రుణాలు పొందిన వారు..

- జిల్లా జనాభా 9,25,340 మంది
- బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారు 3 లక్షల పైబడి..
- పంట రుణాలు తీసుకున్న వారు 1,34,120 మంది
- వ్యవసాయ ఆధారిత రుణాలు తీసుకున్న వారు 1,92,297 మంది
- ఎంఎస్ఎం రుణాలు తీసుకున్నవారు 18678 మంది
- నాన్ ప్రయార్టీ రుణాలు తీసుకున్న వారు 59,172 మంది
- ఎడ్యుకేషన్ లోన్ 1058 మంది
- ఇళ్ల నిర్మాణాల కోసం రుణాలు తీసుకున్న వారు 1617 మంది

వ్యవసాయం కోసం...

వ్యవసాయం కోసం రుణాలు తీసుకుంటున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఏటా వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోవడం, కూలీలు, ఎరువుల ధరలు, యంత్రాల అద్దెలు అన్నదాతలకు భారమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకులను ఆశ్రయించి రుణాలు పొందుతున్నారు. అయితే ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదు. పెట్టుబడులును సైతం పొందలేని పరిస్థితి. మొత్తంగా అన్నదాతలకు వ్యవసాయం కత్తిమీద సాములా మారింది. పాత అప్పులను తీర్చేందుకు మళ్లీ కొత్తగా రుణాల కోసం పరుగులెత్తాల్సిన దుస్థితి ఏర్పడింది.

ముగ్గు మనోహరం

- ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీలు
- సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టిన వైనం
- ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మలికాగార్గ్ హాజరు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు


ఎయిమ్ స్కూల్ ప్రాంగణంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



(ఆంధ్రజ్యోతి బృందం)

సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్టుగా... హరివిల్లు నేలపై విరిసినట్టుగా అక్కడ ముగ్గులు పూశాయి. మహిళల ప్రతిభకు అద్దం పట్టాయి. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంతూర్ ముగ్గుల పోటీలు విజయనగరంలోని తోటపాలెంలో గల ఎయిమ్స్ స్కూల్ మైదానం వేదికగా శనివారం నిర్వహించారు. విజయనగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి 84 మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో ఈ పోటీలు వైభవంగా జరిగాయి. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ పోటీలు 12.30 గంటలకు ముగిశాయి. వివిధ రంగాలకు చెందిన జి.శిరీష, కల్పనా కుక్రేజా, దేవి ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఇటువంటి కార్యక్రమాలు మహిళలకు ఎంతో ఉత్సాహన్నిస్తాయన్నారు. ప్రతి ఏటా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంస్థలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమన్నారు. సంక్రాంతి పండుగ ఎంతో ఆనందాన్ని ఇచ్చేదని తెలిపారు. యువతీ యువకులకు సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను తెలిపేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయని ఆమె తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇటువంటి కార్యక్రమాలను నిర్వాహకులు కొనసాగించాలని ఆమె సూచించారు. ప్రముఖ గైనకాలజిస్ట్, డాక్టర్ పి.సన్యాసమ్మ మాట్లాడుతూ ఎంతో సమయం వెచ్చించి, కష్టపడి మహిళలు వేసిన ముగ్గుల్లో వారి ప్రతిభ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో ఏటా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి, వాణిజ్య సంస్థలతో కలిసి ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహించడం హర్షణీయమన్నారు. విద్యార్థినులు, మహిళలు ఎన్నో సమస్యలతో తన వద్దకు వస్తున్నారన్నారు. ముఖ్యంగా రక్తహీనత, రుతుస్రావం క్రమంగా అవ్వకపోవడం, బీపీ, షుగర్ వంటి వ్యాధులతో మహిళలు తన వద్దకు రావడం ఎంతో బాధగా ఉందన్నారు. మహిళలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థి నులు ఇంట్లో తల్లికి వంట, ఇంటి పనిలో సహకరించాలని హితవు పలికారు. దీనివల్ల ఎంతో ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరించిన ఎయిమ్ స్కూల్స్ అధినేత కడగల ఆనందకుమార్ మాట్లాడుతూ, అంతరించిపోతున్న ముగ్గు అనే కళను బయటకు తీసుకురావడమే కాకుండా... రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏటా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంస్థలు పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. లోకల్ స్పాన్సర్‌గా తమకు అవకాశం కల్పించడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి బింబించేలా... ఈ ముగ్గుల పోటీలు కొత్తశోభను తీసుకువచ్చాయని అన్నారు. విజయనగరం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు అవనాపు భార్గవి మాట్లాడుతూ, ముగ్గుల పోటీలు సంక్రాంతి శోభను తీసుకువచ్చాయన్నారు. ఇవి మహిళల శారీరక, మానసిక వికాసానికి దోహద పడతాయని అన్నారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన జి.శిరీష, కల్పనా కుక్రేజా, ఎ.దేవిలు మాట్లాడుతూ... 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు మంచి ముగ్గులు వేశారని ప్రశంసించా రు. నిబంధనల ప్రకారం తాము మార్కులు వేశామన్నారు. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' భవిష్యత్తులో కూడా పోటీలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎయిమ్ స్కూల్ ఏఓ బాలాజీ, సిబ్బంది, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మలికాగార్గ్


పేర్లు నమోదు చేసుకుంటున్న మహిళలు



స్పాన్సర్స్ లోగోలను వేస్తున్న విద్యార్థినులు


ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలు రాజు, అరుణ, సింధుజలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం(కుడి నుంచి ఎడమ వైపునకు)

చాలా సంతోషంగా ఉంది..



యువత మరిచిపోతున్న కళకు 'ఆంధ్రజ్యోతి' ఏటా ప్రాణం పోస్తోంది. సంస్థ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి సాధించడం చాలా ఆనందంగా ఉంది. గతంలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహించిన ముగ్గుల పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం వచ్చింది. ఈ ఏడాది కూడా రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తాం. చుక్కల ముగ్గులు వేయడంలో ప్రావీణ్యం ఉండాలి. ముగ్గులు వేయడాన్ని నిత్యం సాధన చేస్తాను. పాటలు పాడుతాను. ప్రతి ఇంటి ముందు కళ్లాపు జల్లి, ముగ్గులు వేయడంలో సైన్సు దాగి ఉంది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంస్థ ఈ ముగ్గుల పోటీలు నిర్వహించడం వల్ల మరెంతమందికో స్ఫూర్తి కలుగుతుంది.

-ములుగు రాజు, ప్రథమ విజేత

బహుమతి రావడం ఆనందంగా ఉంది..



ముగ్గుల పోటీల్లో రెండో బహుమతి రావడం ఆనందంగా ఉంది. తెలుగు సంప్రదాయబద్ధంగా ముగ్గులు వేశాం. నేను సంక్రాంతి పండుగ ముందే కాకుండా నిత్యం ముగ్గులు వేస్తాను. ప్రతి రోజు ముగ్గులు వేయడం వల్ల వ్యాయామం అవుతుంది. ప్రతి ఇంటి ముందు మహిళలు ముగ్గులు వేస్తే పిల్లలు నేర్చుకుంటారు. ప్రతి మహిళ వారి పిల్లలకు ముగ్గులు వేయడం నేర్పించాలి. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న 'ఆంధ్రజ్యోతి -ఏబీఎన్' సంస్థలకు అభినందనలు.

-కనకల అరుణ, ద్వితీయ బహుమతి విజేత

పోటీల కోసమే వచ్చా..



నేను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాను. 'ఆంధ్రజ్యోతి -ఏబీఎన్' నిర్వహించిన ముగ్గుల పోటీల కోసం ఇక్కడికి వచ్చాను. ముగ్గుల పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఈ పోటీల్లో మూడో బహుమతి వచ్చింది. గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి వచ్చింది. బాలికలు విద్యార్థి దశ నుంచి ముగ్గులు వేయడం నేర్చుకుంటే మంచిది. అలాగే తల్లిదండ్రులు కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగించేలా ఆడపిల్లలకు ముగ్గులు నేర్పించాలి.

-టి.సింధుజ, తృతీయ బహుమతి విజేత

పార్వతీపురంలో..

- ఘనంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీలు
- పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయచంద్ర
- విజేతలకు బహుమతులు అందించిన ఎస్పీ మాధవరెడ్డి

ముగ్గుల పండుగ


ముగ్గులు వేస్తున్న మహిళలు

పార్వతీపురం/టౌన్/ బెలగాం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో శనివారం ముత్యాల ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి ఫర్‌ఫెక్ట్ ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో ఈ పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వర జ్యూయల్ ప్యాలెస్ యజమాని ఇండుపూరు గోపాలరావు స్థానిక స్పాన్సర్‌గా వ్యవహరించారు. ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర రిబ్బన్ కత్తి రించి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినంద నీయమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోటీలు నిర్వహించడం వల్ల ముం దుగానే సంక్రాంతి పండగ వచ్చిన వాతావరణం కనిపిస్తోందని అన్నారు. కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.సీతారాం, జి.వి.నాయుడు, బి.చంద్రమౌళి, కె.నారాయణ రావు. బి.గౌరునాయుడు, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్పాన్సర్స్ లోగోలను వేస్తున్న యువతులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీల వల్ల భవిష్యత్ తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుస్తాయని చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఎంఈవో విమల కుమారి, మహిళా ఉపాధ్యాయులు రోజారాణి, ప్రమీల మాట్లాడుతూ ముగ్గుల పోటీల్లో యువతులు ఎక్కువ మంది పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' యాజమాన్యాన్ని న్యాయ నిర్ణేతలు అభినందించారు.


విజేతలు జి.కృష్ణవేణి, కె.పవిత్ర, వి.అరుణలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

సంస్కృతిని కాపాడడం అభినందనీయం: ఎస్పీ

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆ దిశగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ముత్యాల ముగ్గుల పోటీల్లో యువతులు ఎక్కువగా పాల్గొనడం హర్షణీయమని అన్నారు. నేటి యువతకు మన సంస్కృతిని తెలియజేయడం శుభపరిణామమని ఆయన కొనియడారు. ఈ పోటీలు నిర్వహించడంతో జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి ముందుగానే వచ్చిందని అన్నారు. కలెక్టర్ సతీమణి భాగ్యమహాలక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి పోటీలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. సంక్రాంతి పండగ రంగవల్లికలకు ప్రతీక అని... అటువంటి రంగవల్లుల పోటీలను 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించడం హర్షణీయమన్నారు. స్థానిక స్పాన్సర్, శ్రీ వెంకటేశ్వర జ్యూయల్ ప్యాలెస్ యజమాని ఇండుపూరు గోపాలరావు మాట్లాడుతూ ఏటా ముగ్గుల పోటీల తనను భాగస్వామిగా చేయడం ఆనందంగా ఉందని అన్నారు. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని చెప్పారు. డీపీఆర్వో రమేష్


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

విజేతలు వీరే..

జిల్లా కేంద్రం పార్వతీపురంలో జరిగిన 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల్లో 92 మంది పాల్గొన్నారు. ఇందులో పార్వతీపురం మండలం సూడిగాం గ్రామానికి చెంది న జి.కృష్ణవేణి ప్రథమ స్థానం సాధించారు. ఆమెకు రూ.6 వేల నగదు బహుమతిని ఎస్పీ మాధవరెడ్డి అందించారు. పార్వతీపురం పట్టణానికి చెందిన కె.పవిత్ర ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఆమెకు రూ.4 వేల నగదు బహుమతిని కలెక్టర్ సతీమణి భాగ్యమహాలక్ష్మి అందించారు. పార్వతీపురం పట్టణానికి చెందిన వి.అరుణ తృతీయ స్థానం సాధించారు. ఆమెకు రూ.3 వేల నగదు బహుమతిని స్థానిక స్పాన్సర్ ఇండు పూరు గోపాలరావు అందించారు. ఈ కార్యక్రమంలో 'ఆంధ్ర జ్యోతి' స్టాఫర్ డీఎస్ఆర్ పట్నాయక్, విలేకరులు ఎస్.గౌరీశంకర్, గుంట్రెడ్డి పోలినాయుడు, ఒ.సత్యన్నా రాయణ, రాఘవేంద్రరావు, డి.తిరుపతిరావు, మురళి, కోట శివ, చప్ప వెంకటరమణ, సింహాచలం, గంట గోపాలరావు, ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం కలెక్టరేట్: విజయనగరంలోని ప్రభుత్వకళాశాల విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్


చీపురుపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు


రాజాం: విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

ఇంటర్ విద్య బలోపేతానికి కృషి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి
- జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు.ఇంటర్ విద్య బలోపేతానికి కృషి చేస్తోందని చెప్పారు. శనివారం జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ అంబేడ్కర్, ప్రజాప్రతినిధులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనంచేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు మధ్యాహ్న భోజన పథకం దోహదపడుతుందని తెలిపారు. నాణ్యమైన భోజనం అందించాలని కోరారు.ల్యాబ్లు, లైబ్రరీలకు నిధులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు.

●విజయనగరం కలెక్టరేట్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలెక్టరు అంబేడ్కర్ మధ్యాహ్నం భోజన పథకం ప్రారంభించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. గంట్యాడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో డీవీఈవో బీమా శంకర్ ప్రారంభించారు.

●శృంగవరపుకోట/వేపాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట,వేపాడ ప్రభుత్వ జూనియర్‌లో ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు.

● రాజాం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజాంప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రారంభించారు.

● భోగాపురం, జనవరి4(ఆంధ్రజ్యోతి):భోగాపురం మోడల్‌స్కూల్‌లో మధ్యాహ్న భోజనపథకాన్ని మార్కెఫెడ్ చెర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతుబంగార్రాజు ప్రారంభించారు.

● నెల్లిమర్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని సీకేఎం ప్రభుత్వజూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రారంభించారు.

●చీపురుపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ప్రారంభించారు.


శృంగవరపుకోట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి


భోగాపురం: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు


నెల్లిమర్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

ఎస్.కోటలో ఒంటె



శృంగవరపుకోట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎడారి ఓడగా పిలిచే ఒంటె శనివారం ఎస్.కోటలో కనిపించడంతో పెద్దసంఖ్యలో చూసేందుకు తరలివచ్చారు. శృంగవరపుకోటలోని పలు వీధుల్లో దానిన్ని యజమాని తిప్పాడు. రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఒంటెలు ఉంటాయి. ఇక్కడ అరుదుగా కనిపించేఒంటెను వీధుల్లోకి రావడంతో మహిళలు,పిల్లలు ఆసక్తిగా చూశారు.

7న రంగోత్సవ్ పోటీలు

నెల్లిమర్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వేణుగోపాలపురంలోని ప్రభుత్వ డైట్‌లో ఈనెల ఏడో తేదీన ఎనిమిది అంశాల్లో జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ తెలిపారు. డైట్‌లో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వివరాలకు పి.రవికుమార్ 7989350244, కె.సూర్యారావు 8919985388 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

గ్రంధి చినబాబు భార్య మృతి


సరస్వతి (ఫైల్)

రాజాం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి చిననన్యాసిరాజు (చినబా బు) భార్య గ్రంధి సరస్వతి (81) శుక్రవారం అర్ధరాత్రి రాజాంలో మృతిచెందారు. కొం తకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతు న్నారు. ఆమె ప్రముఖ పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లిఖార్జునరావు (జీఎంఆర్) సోద రుడి భార్య. శనివారం రాజాంలో సరస్వతి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమం లో జీఎంఆర్,ఆయన సోదరులు గ్రంధి పెద బాబు, ఈశ్వరరావుతోపాటురాజకీయ, పారిశ్రామిక, వ్యాపార, వర్తక రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

గడసాంలో గ్రామసభ

దత్తిరాజేరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడసాంలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించడంతోపాటు పలు పనులకు సంబంధించి తీర్మానించారు. కార్యక్రమానికి టీడీపీ మండల ఉపాధ్యక్షుడు మజ్జి మహేష్, సర్పంచ్, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యవేక్షణ అవసరం

రేగిడి, జనవరి 4, (ఆంధ్రజ్యోతి): పాఠశాలలపైపేరెంట్స్‌కమిటీ నిరంతర పర్యవేక్షించాలని ఎంఈవో వరప్రసాదరావు కోరారు. బూరాడ యూపీ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఆలయాలను రక్షించుకోవాలి

రాజాం,జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆలయాలను రక్షించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మన హిందూ దేవాలయాలన్ని మనమే నిర్వహించుకుంటాం అన్న నినాదంతో ఆదివారం విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే హైందవ శంఖారావానికి రాజాం నుంచి 75 మంది పాల్గొనడానికి బయలుదేరారు. ఈ మేరకు విజయవాడ వెళ్తున్న బస్సులకు శనివారం రాత్రి జెండా ఊపి మానవతా సంస్థ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షుడు అచ్యుత్‌కుమార్, కార్యదర్శి నీలకంఠేశ్వరయా దవ్, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్, రాజన్న, కైలాష్, శ్రీను పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ

అంధుల అక్షరప్రదాత లూయిస్ బ్రెయిలీ అని వక్తలు పేర్కొన్నారు. అంధుల జీవితాల్లో బ్రెయిలీ వెలుగులు నింపారని శనివారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, విద్యావనరుల కేంద్రాల్లో బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి పురస్కరించుకుని లూయిస్ చిత్రపటం వద్ద పూలమాలలువేసి నివాళులర్పించారు.

● శృంగవరపుకోట జనవరి 4 (ఆంధ్రజ్యోతి) శృంగవరపుకోట భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించిన ర్యాలీలో విద్యాశాఖాధికారులు నర్సింగరావు, ఉపాధ్యాయులు సీతారామయ్య, ఆర్.శ్రీనివాసరావు, భవత కేంద్ర టీచర్ బి.లీలా కృష్ణ పాల్గొన్నారు.

●రేగిడి,జనవరి 4(ఆంధ్రజ్యోతి):రేగిడి సహిత విద్యావనరుల కేంద్రంలో లూయిస్ చిత్రపటానికి ఎంఈఓ వరప్రసాదరావు, బి.ఏరకయ్యలు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేశ్వరీ, రాజేష్, అనురాధ పాల్గొన్నారు.

● గరివిడి, జనవరి 4(ఆంధ్రజ్యోతి):గరివిడి భవిత కేంద్రంలో ఎంఈవో-1, 2లు పి.రామారావు, డి.అప్పన్నలు లూయిస్‌బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సహిత విద్యఉపాధ్యాయులు ఈశ్వరరావు, పి.సుమలత పాల్గొన్నారు.

● డెంకాడ,జనవరి 4(ఆంధ్రజ్యోతి):డెంకాడ భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సహిత విద్యా సమన్వయకర్తలు సూర్యారావు, భారతి మాట్లాడుతూ బ్రెయిలీ లిపి అంధ విద్యార్థులకు వరమని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీరాం, ఐఆర్‌పీలు రవీంద్ర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించండి

రాజాం, జనవరి 4, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. గత ప్రభుత్వ విధానాల వల్ల వైద్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. శనివారం రాజాం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాము లు కావాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని మురళీమోహన్ హెచ్చరించారు. గర్భిణులకు సరైన వైద్యం అందడంలేదని, గైనకాలజిస్టులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కమిటీ సభ్యురాలు టంకాల సావిత్ర వివరించారు. అనంతరం ఆర్టీసీ బస్సు స్టాండ్ ఆవరణలో శ్రీకాకుళం-సాలూరు బస్సును ప్రారంభించారు. కాగా ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లిఖార్జునరావు సోదరుడు గ్రంధి చినబాబు భార్య సరస్వతి శనివారం మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని కోండ్రు మురళీమోహన్ పరామర్శించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కర్నం హరిబాబు, కమిటీ సభ్యుడు తెంటు కమలనాయుడు, డాక్టర్లు కోటేశ్వరరావు, తిరుపతిరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీలు ఎ-గ్రేడ్‌లో ఉండాలి: ఏపీఎం

గరివిడి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) ఎ-గ్రేడ్‌లో ఉండే విధంగా పనిచేయాలని ఏపీఎం పి.నారాయణరావు కోరారు. శనివారం గరివిడిలోని మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్వయంసహాయక సంఘాల బలోపేతా నికి సిబ్బందికష్టపడి పనిచేయాలన్నారు. సంఘ లావాదేవీలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సంఘ సమావేశాలు సక్రమంగా నిర్వహించి ప్రతి సభ్యురాలు రూ.200లు చొప్పున పొదుపు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎర్రినాయుడు, విజయలక్ష్మి, సీసీలు సత్యనారాయణ, ఆదినారాయణ, వీవోఏలు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు నాణ్యతతో చేయాలి

భోగాపురం,జనవరి4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద నిర్వహించే ప్రతి పని ప్రజలు, రైతులకు ఉపయోగపడాలని, గుర్తించిన పనులు నాణ్యతతో చేయాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి తెలిపారు. పనుల్లో అక్రమాలకు పాల్పడితే క్షమించేదిలేదని హెచ్చరించారు. శనివారం మండలంలోని ముంజేరులో నియోజకవర్గం పరిధిలో ఉపాధిహామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో నాయకులు లోకంప్రసాదు, భోగాపురం, పూస పాటిరేగ, డెంకాడ, నెల్లిమర్ల మండలాల ఏపీవోలు భాగ్యలక్ష్మి, రత్నమాల, తిరుపతిరావు, అరుణకుమారి పాల్గొన్నారు.

పశుసంపద సంరక్షణపై శ్రద్ధవహించాలి

రేగిడి, జనవరి 4, (ఆంధ్రజ్యోతి): పశుసంపద సంరక్షణపై రైతులు, పశువైద్య సిబ్బంది శ్రద్ధవహించాలని జిల్లాపశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి సీహెచ్ సత్యప్రకాశ్ తెలిపారు. శనివారం మండలంలోని పనసలవలసలో ఉణుకూరు పశువైద్యశాలఆధ్వర్యంలో మండలస్థాయి పశువైద్యశిబిరాన్ని సత్యప్రకాశ్, రాజాం పశువైద్యశాఖ ఏడీ జయప్రకాశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 72 పశువులకు వైద్యతనిఖీలు నిర్వహించిమందులు, పశుదాణా అందజేశారు. కార్యక్రమంలో పనసలవలస సర్పంచ్ గోవిందరావు, రేగిడి, ఉణుకూరు పశువైద్యులు ఎం.దుర్గాప్రసాద్, వి.రాం, శరత్‌చంద్ర, రేగిడి, ఉణుకూరు వెటర్నీరీ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించండి

విజయనగరం దాసన్నపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు.ఈ మేరకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను శనివారం ఆయన కార్యాలయంలో సంఘం నాయకులు సంఘ నేతలు కెల్ల శ్రీనివాసరావు, గొర్లె సూరిబాబు, బుచ్చిబాబు, వెంకటరమణ, హరిబాబు, సన్యాసిరావు, శంకరరావు కలిశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాజాం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ. కె.అశోక్‌కుమర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తెలగ వీధిలో సైబర్ నేరాలు, మత్తుపదార్థాల వినియోగం-అనర్థాలు తదితర అంశాలపై శనివారం రాత్రి అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్ల ఏయేతరహాలో నేరాలు చేస్తున్నారో వీధివాసులకు వివరించారు.

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు పీఈటీ పరీక్ష

విజయనగరం క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్టైపండరీ మహిళా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు విజయనగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో టీఎంటీ, పీఈటీ ప్రక్రియ కొనసాగుతోంది. ఐదో రోజు 550 మంది మహిళా అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 320 మంది హాజరుకాగా వీరికి పీఎంటీ, పీఈటీ పరీక్ష నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలతలు స్వయంగా పర్యవేక్షించారు. ఆదివారం మహిళా అభ్యర్థులకు యధావిధిగా పరీక్షలు జరుగుతాయని ఎస్పీ తెలిపారు. నియామక ప్రక్రియలో ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు యూనివర్స్, వీరకుమార్, బాపూజీ, శ్రీనివాసరావు, థామస్‌రెడ్డి, ఎట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి నుంచి విజయనగరంలో ప్రోపర్టీ షో



క్రెడాయ్ ప్రోపర్టీషో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

రింగురోడ్డు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో రింగురోడ్డు వద్దగల లీప్యారడైజ్ కన్వెన్షన్ హాలులో ఆదివారం నుంచి ఈనెల ఏడో తేదీ వరకూ క్రెడాయ్ ఆధ్వర్యంలో ప్రోపర్టీషో నిర్వహించనున్నట్లు క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుభాష్ చంద్రబోస్ తెలిపారు. శనివారం విజయనగరంలోనిప్రదీప్‌నగర్‌లో గల క్రెడాయ్ భవన్ కార్యాలయంలో ప్రోపర్టీషోకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణాలు చేపట్టేవారు, స్థలాలు కావల్సిన, నిర్మాణాలు చేయలదలిచిన వారు ప్రోపర్టీషోలో పాల్గొనాలని కోరారు. ఇక్కడ గృహ నిర్మాణ రంగానికి అవసరమైన సుమారు 100 రకాల స్టాల్లు, ఇంటీరియల్ డెకొరేషన్స్, లిఫ్టులు, ఆటోమొబైల్స్ వీఎంఆర్‌డీఏ ప్లాట్స్, డూప్లెక్స్ విల్లాస్, జనరేటర్స్, సోలార్ ఏనర్జీకి సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు అందుబాటులో ఉండి, సలహాలు సూచనలు అందిస్తారన్నారు. మూడురోజుల పాటు విశాఖ అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో క్రెడాయ్ ప్రతినిధులు వి.పార్థసారధి, సూర్యనారాయణరాజు, కిలాని రాజశేఖర్, జీబీ అనీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ

విజయనగరం టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భోగాపురం యూనిట్ కార్యాలయంలో ఏపీఎన్జీవో జిల్లా వాల్ క్యాలెండర్‌ను ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేవీ శివారెడ్డి, ఎ.విద్యాసాగర్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డీవీ రమణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్‌బాబు, సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు జీవీఆర్ కిశోర్, సురేష్, నీలాద్రి నాయుడు, కేవీ శ్రీనివాసరావు, శ్రీస్వప్న, సభ్యులు పాల్గొన్నారు.

మానసాదేవి అమ్మవారికి పూజలు

చీపురుపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సుమన్ రామలింగపురంలోని మానసాదేవి అమ్మవారిని శనివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త పిన్నింటి రమణ దంపతులు, పిన్నింటి శ్రీను, పుర్రేయవలస సర్పంచ్ సారిక మోహనరావులు సుమన్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ సినిమా షూటింగ్ నిమిత్తం అరకులో ఉన్నానని, అమ్మవారిని దర్శించుకోవాలని ఇక్కడికి వచ్చానని తెలిపారు.

వేంకటేశ్వర స్వామికి పండ్లతో అలంకరణ

శృంగవరపుకోట జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలని వేదమాత గాయిత్రీ దేవి ఆలయంలోని వేంకటేశ్వరస్వామికి వివిద రకాలపండ్లతో అలంకరించారు. ధనుర్మాసం లోవచ్చే శనివారం స్వామివారిని వివిద రూపాల్లో అలంకంచి పూజలు చేస్తుంటారు.

సైనిక పాఠశాల పూర్వ విద్యార్థుల కలయిక

విజయనగరం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి):కోరుకొండ సైనిక పాఠశాలలో 1974-1982 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ కలయిక కార్య క్రమాన్ని శనివారం నిర్వహించారు. పాఠశాలలో వారు చేరి 50 ఏళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని స్వర్ణోత్సవాలు జరుపుకొన్నారు.ఇక్కడ చదువుకున్న రాష్ట్రంతోపాటు, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారంతా ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. పూర్వవిద్యార్థులు తమ సహచరులతో పాఠశాల ప్రాంగణమంతా ఇరిగి తమ చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్‌కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి వారికి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాఠశాల ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బెలగాం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పార్వతీపురం పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. పార్వతీపురం మండలం చినబొండపల్లి గ్రామానికి చెందిన గండి గుంపస్వామి(72) ద్విచక్ర వాహనంపై పార్వతీపురం వచ్చి తిరిగి వెళ్తున్నారు. పట్టణ శివారున సుందరయ్య భవనం సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో గుంపస్వామి అక్కడికక్కడే మృతిచెందారు. వేరే ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రి తరలించారు. ఏఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరు జార్ఖండ్‌వాసుల అరెస్టు: ఎస్పీ

విజయనగరం క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోరీ కేసులో ఇద్దరు జార్ఖండ్‌వాసులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 18 తులాల బంగారం వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందాల్ ఏఎస్పీ సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు శ్రీనివాస్, లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరితో కలిసి పోలీసు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ కథనం మేరకు.. గత ఏడాది డిసెంబరు 24న కాలిఘాట్ కాలనీలో నివాసముంటున్న కొట్టెక్కి జగన్మోహన్‌రావు టైలరింగ్ షాపునకు వెళ్లారు. అదే సమయంలో ఆయన భార్య ఇంటికి తాళం వేయకుండా గాజులు కొనడానికి సమీపంలో గల షాపునకు వెళ్లింది. ఆ సమయంలో బెలూన్లు విక్రయిస్తున్న గుర్తుతెలియని మహిళ ఆ ఇంట్లోకి ప్రవేశించి 18 తులాల బంగారం వస్తువులను దొంగిలించుకుని వెళ్లిపోయింది. ఇంటికి వచ్చిన జగన్మోహన్‌రావు భార్య పరిశీలించగా, బంగారం వస్తువులు దొంగతనానికి గురైనట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదే సమీపంలో గల మాంసం దుకాణం వద్ద ఉన్న ఓ మహిళ జగన్మోహన్‌రావు ఇంటి నుంచి దొంగిలించి వస్తున్న మహిళ, ఇద్దరు పిల్లలను చూసి ప్రశ్నించగా వర్షం వల్ల ఆ ఇంటిలో తలదాచుకున్నట్లు చెప్పి పరారయ్యింది.ఈనేపథ్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి చోరీకి జార్ఖండ్‌కు చెందిన వ్యక్తులు పాల్పడ్డారని గుర్తించారు. దీంతో జార్ఖండ్‌లోని టాటానగర్‌కు చెందిన నేహా సబర్, ఆలియాస్ నేహాజానీ, అలియాస్ నేహాశోభర్, ఆమె భర్త సరోజ్ జానీ, ఆలియాస్ సరోజ్ శోభర్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 18 తులాల బంగారు అభరణాలు స్వాధీనం చేసుకున్నారు.వారిని రిమాండ్‌కుతరలించారు. ఈకేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ఐ ప్రసన్నకుమార్, కానిస్టేబుళ్లు గౌరీశంకర్, శ్రీనివాస్, కె.సన్యాసినాయుడు, మహిళా పీసీలు మంగమ్మ, షేక్ మీరాబీలను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించి, ప్రశంసాపత్రం అందించారు.

బస్సు బోల్తాపై భిన్నాభిప్రాయాలు

మెంటాడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చిరాజుపేట, గురమ్మవలస గ్రామాల మధ్య ఈనెల మూడోతేదీన ఆర్టీసీ బస్సు బోల్తా ఘటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా డ్రైవర్, డిపో మేనేజర్ పరస్పర విరుద్ధ వివరణలతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.సాంకేతిక సమస్య వల్ల బస్సు అదుపుతప్పి బోల్తా పడిందని డ్రైవర్ భాస్కరరావు చెబుతుండగా డ్రైవర్ తప్పిదమే కారణమని విజయనగరం డిపో మేనేజర్ శ్రీనివాస్ తేల్చిచెప్పారు. ప్రమాద స్థలానికి కేవలం నాలుగైదు మీటర్లు ముందున్న కాజ్‌వే పై ఉన్నగుంతను చూసుకోకుండా నడపడంవల్ల కుదుపులకు గురై కల్వర్టు దాటిన వెంటనే ఇరుకురోడ్డుపై నుంచి బోల్తా పడిందని డిపో మేనేజర్ పేర్కొన్నారు. బస్సును ప్రమాదస్థలానికి కొద్దిదూరానికి తరలించి అక్కడే ఉంచగా, దాన్ని డిపోనకు తీసుకొచ్చేశామని,దెబ్బతిన్నవాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసి సిద్ధం చేశామని డీఎం పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.ఇందులో ఎవరు చెబుతున్నది వాస్తవమో తెలియవలసిఉంది.

సారా విక్రయదారులపై పీడీ చట్టం: సీఐ

మెంటాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) :సారా విక్రయదారులపై పీడీ చట్టం ప్రయోగిస్తామని గజపతినగరం ఎక్సైజ్ సీఐ జనార్దన్ హెచ్చరించారు. శనివారం లోతుగెడ్డలో సారా, మద్దికళ్లు తాగడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తుతో జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. సారా, మద్ది కల్లు అమ్మినా,తయారు నేరమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్రకుమార్, సిబ్బంది రాజు, భాషా, అప్పారావు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించండి: ఆర్డీవో

భోగాపురం, జనవరి4(ఆంధ్రజ్యోతి): రీసర్వేకు రైతులు సహకరించి విజయవంతం చేయాలని ఆర్డీవో దాట్లకీర్తి కోరారు. శనివారం మండలంలోని రావాడలో రీసర్వేకు సంబంధించి తహసీల్దార్ ఎం.సురేష్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో జరిగిన సర్వేలో పొరపాట్లు ఉన్నట్లు గుర్తించి రీసర్వే చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ ఎ.పైడినాయుడు, సూర్యనారాయణమూర్తిరాజు, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం జరగకపోతే పోరాటం

చీపురుపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కర్లాం వెంకటరామా కోళ్ల పరిశ్రమలో వేతనాలు పెంచాలని నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులకు న్యాయం జరగకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హెచ్చరించారు. శనివారం పట్టణంలో కార్మికులకు మద్దత్తుగా ర్యాలీ నిర్వహించి, అనంతరం మూడు రోడ్ల కూడలిలో మానవహారం చేశారు. కార్మికులకు సంఘీభావంగా ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా వేతన పెంపుదల కోసం కార్మికులు నిరసన దీక్షలు చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టీవీ రమణ, ఏ. గౌరినాయుడు, గురునాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల హక్కుల పరిరక్షణకు సదస్సులు

విజయనగరం క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజల హక్కులు, న్యాయ పరిరక్షణకు లోక్‌అదాలత్ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ చైర్మన్ జి.దుర్గయ్య తెలిపారు. శనివారం విజయనగరంలోని గంట స్తంభం సమీపంలోని పీడబ్ల్యూ మార్కెట్‌లో ప్రజల హక్కులు, న్యాయ సమస్యలపరిష్కారానిపై లోక్‌అదాలత్ అవగాహనసదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో సభ్యులు ప్రభాకరరావు, లీడ్ బ్యాంకు మాజీ మేనేజరు శ్రీనివాసరావు, అచ్యుతాంబ, ఇమంది సుధీర్, నారాయణరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు



ఇందిరమ్మ కాలనీలో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఇందిరమ్మ కాలనీలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి శనివారం పర్యటించారు. కాలనీలో చేపడుతున్న కచ్చా కాలువల పనులను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం చూపవద్దని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. డ్రైనేజీ చివరలో అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పోలవానివలసలో నిర్మిస్తున్న శ్మశానవాటిక ప్రహరీ పనులను పరిశీలించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి

రామభద్రపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో తిరుమలప్రసాద్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఐఈఆర్పీ రాజేశ్వరి, తేజస్విని, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు. ● బాడంగి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల లో శనివారం బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి హెచ్ఎం దత్తి సత్యనారాయణ, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావులు నివాళులు అర్పించారు. ● మక్కువ: స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ డేను శనివారం నిర్వహించారు. ఎంఈవో శ్యామసుందరరావు, ప్రత్యేక ఉపాధ్యాయుడు శంకరరావు, దివ్యాంగులు పాల్గొన్నారు. ● కురుపాం: కురుపాంలోని భవిత కేంద్రంలో శనివారం బ్రెయిలీ డే నిర్వహించారు. ఉపాధ్యాయులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు పాల్గొన్నారు.

రేపు వేణుగోపాలస్వామి ఆలయంలో పూలంగి సేవ

బొబ్బిలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా ఈనెల 6న స్వామి వారికి పూలంగి సేవ నిర్వహించనున్నట్టు ఆలయ అనువంశిక ధర్మకర్త ప్రతినిధి, ఎమ్మెల్యే బేబీనాయన శనివారం తెలిపారు. కడియం, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి టన్నుల కొద్దీ పలు రకాల పూలను తెప్పించి దేవతామూర్తులను, ఆలయ ప్రాంగణాన్నంతటినీ ఆకర్షణీయంగా అలంకరిస్తామని చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు

పాలకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు అన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ హేమంత్‌కుమార్, శానిటేషన్ సెక్రటరీలు, సిబ్బందితో కలిసి ఆయన శనివారం పలు షాపులను తనిఖీ చేశారు. ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న పలు షాపులకు అపరాధ రుసుం విధించారు. పలుమార్లు చెప్పినప్పటికీ యథావిధిగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న రెండు షాపులను గుర్తించి వాటికి తాళం వేసి సీజ్ చేశారు.

జనసేనలో చేరిక

పాలకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలానికి చెందిన పలువురు వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి చేరారు. వీరంతా శనివారం పాలకొండలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కీసరజోడు సర్పంచ్ సున్నాపురం రవి, హడ్డుబంగి సర్పంచ్ సవర సుమతి, సర్పంచ్ భర్త సవర సన్యాసిరావు, కొండా సర్పంచ్ సవర ముకుందరావు తోపాటు పలువురు మెంబర్లు పార్టీలో చేరారు. తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, జనసేన పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు ముఖలింగం, సీతంపేట ఐటీడీఏ కో-ఆర్డినేటర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వతేజ పుస్తకావిష్కరణను జయప్రదం చేయండి

పాలకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత నందమూరి తారక రామారావు జీవిత చరిత్రపై విశ్రాంత గ్రంథాలయ ఆచార్యుడు కనపాక చౌదరినాయుడు రాసిన విశ్వతేజ పుస్తకాన్ని పట్టణంలోని ఎస్‌వీడీ కల్యాణ మండపంలో ఆదివారం ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు శనివారం ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సంధ్యారాణి తోపాటు చీపురుపల్లి, కురుపాం, బొబ్బిలి, పార్వతీపురం, పాలకొండ ఎమ్మెల్యేలు హాజరవుతారని చౌదరినాయుడు తెలిపారు. శంకరరావు, అప్పలనాయుడు, గోవిందరావు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి పయనం



హైందవ శంఖారావానికి బయలు దేరిన స్థానికులు

కురుపాం, జనవరి4(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం నిర్వహించనున్న హైందవ శంఖారావానికి కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన పలువురు రెండు బస్సులలో శనివారం కురుపాం నుంచి పయనమయ్యారు. వీరికి హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు అందవరపు కోటేశ్వరరావు, గుడ్ల నగేష్, తాడంగి రామరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎంహెచ్‌వో

గుమ్మలక్ష్మీపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా శనివారం బాధ్యతలు చేపట్టిన ఎస్.భాస్కరరావు శనివారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు వినోద్ ఉన్నారు.

నేడు రావివలసలో క్రికెట్ పోటీలు

గరుగుబిల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రావివలస గ్రామంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంటు నిర్వహించనున్నట్టు ఫ్రెండ్స్ యూత్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మరిశర్ల వెంకటరామినాయుడు క్రీడా ప్రాంగణం, జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రవేశ రుసుం రూ.వెయ్యి చెల్లించాలన్నారు. మొదటి బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు అందిస్తామని చెప్పారు. వివరాలకు 8886235143 నెంబరుకు సంప్రదించాలన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో పీసా ఎన్నికలు

గుమ్మలక్ష్మీపురం, జనవరి 4 (ఆంధ్రజ్యో తి): గుమ్మలక్ష్మీపురం పంచాయతీలో శనివా రం పీసా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఎన్నికల అధికారి ఎ.సత్యవతి ఆధ్వర్యంలో సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర రావు అధ్యక్షతన ఈ ఎన్నికలు నిర్వహించా రు. పీసా ఉపాధ్యక్షుడిగా బొత్తాడ రవిబాబు, కార్యదర్శిగా నిమ్మక దుర్గాప్రసాదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు, టీఆర్ఎఫ్ అధ్యక్షుడు రొబ్బ లోవరాజు, మాజీ సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సమావేశం

వీరఘట్టం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ ధాన్యం సేకరించినప్పుడు దళారులకు ట్రక్ సీట్ ఇవ్వకూడదని, రైతుల వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. ఏవో సౌజన్య, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే..

● జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం





గుమ్మలక్ష్మీపురంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి, బాడంగిలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన..

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే కూటమి ప్రభుత్వం కళాశాలల్లో ఎండీఎంను ప్రవేశపెట్టిందని స్థానిక ఎమ్మెల్యేలు అన్నారు. శనివారం పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యేలు విద్యార్థులకు స్వయంగా వడ్డించి, అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ● గుమ్మలక్ష్మీపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పాడి సుదర్శనరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శనివారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● పార్వతీపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎండీఎంను ఎమ్మెల్యే విజయచంద్ర ప్రారంభించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, ఎంఈవోలు పాల్గొన్నారు. ● పాలకొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో ఎండీఎంను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. వంట సామగ్రిని, ప్లేట్లు వితరణగా అందించిన టీడీపీ నాయకుడు పల్లా కొండలరావుకు అభినందనలు తెలిపారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ● బాడంగి: స్థానిక జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తెంటు రవిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సీతానగరం: భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, పాలకొండ: విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

జాతీయ స్థాయిలో జిల్లా విద్యార్థులు పోటీపడాలి

● పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

బెలగాం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగే యువజన ఉత్సవాల్లో జిల్లా విద్యార్థులు పోటీ పడాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే జిల్లా విద్యార్థులకు నిధులు సమకూరుస్తానని తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా యువజన ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులు రూపకల్పన చేసిన విద్యా, వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనలను ఆయన తిలకించారు. విద్యార్థులతో కలిసి థింసా నృత్యం చేశారు. న్యాయ నిర్ణేతలకు దుశ్శాలువ, జ్ఞాపికలను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన సంక్షేమాధికారి కె.వెంకట ఉజ్వల్, సెట్విజ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.రామ్‌గోపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, డీపీఆర్వో ఎల్.రమేష్, మండల విద్యా శాఖాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు యువకులపై పోక్సో కేసు?

పార్వతీపురంరూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఇటీవల ఓ గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలికపై ఈ ముగ్గురు యువకులు పలు పర్యాయాలు అత్యాచారం చేసినట్లు సమాచారం. దీనిపై బాలిక కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పోలీసులు కూడా దర్యాప్తు ప్రారంభించి యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ప్రకటించలేదు.

ఎరువుల షాపు తనిఖీ

బలిజిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న ఎరువుల షాపులను పార్వతీపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు మధుసూదన్ ఆధ్వర్యంలో శనివారం తనిఖీ చేశారు. ఎరువుల షాపుల్లో రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. ఎరువుల బస్తాలు తూకవ వేయించి బరువును పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

సీఎం సహాయ నిధి పంపిణీ

తెర్లాం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పాములవలస గ్రామానికి చెందిన దత్తి జయమ్మకు ఎమ్మెల్యే బేబీనాయన శనివారం సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. ఆమె గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ మేరకు ఎమ్మెల్యే ఆమెకు సీఎం సహాయ నిధి నుంచి రూ.81వేలు వచ్చేలా కృషి చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు తెలిపారు. ఈ మేరకు తెంటు బంగ్లాలో బాధితురాలికి ఎమ్మెల్యే చెక్కును అందజేశారని చెప్పారు. రాష్ట్ర వాణిజ్య విభాగాల కార్యనిర్వాహక కార్యదర్శి వేంకటేశ్వరరావు, మండల నాయకులు పాల్గొన్నారు. ● బాడంగి: కోటిపల్లి గ్రామానికి చెందిన డోకల వెంకటలక్ష్మికి ఎమ్మెల్యే బేబీనాయన శనివారం బాడంగిలో రూ.45వేల సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు తెంటు రవిబాబు, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, మాజీ ఎంపీపీ త్రినాథనాయుడు పాల్గొన్నారు.

హయగ్రీవ అవతారంలో వెంకన్న



హయగ్రీవ అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బొబ్బిలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా స్థానిక సింగారపు వీధి వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని శనివారం హయగ్రీవ అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు, భక్తసంఘం ప్రతినిధి చెలికాని వేణుగోపాలరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బేబీనాయన స్వామివారిని దర్శించుకున్నారు.

శంబర పండగకు మంత్రికి ఆహ్వానం



మంత్రి సంధ్యారాణికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దేవదాయ శాఖ అధికారులు

సాలూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ సిరిమాను పండగకు విచ్చేయాలని కోరుతూ జిల్లా దేవదాయ శాఖ అధికారి రాజారావు, ఆలయ దేవదాయ శాఖ అధికారి సూర్యనారాయణ.. మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి మొదటి ఆహ్వాన పత్రాన్ని శనివారం అందజేశారు. శంబర పండగను రాష్ట్ర పండగగా ప్రకటించడంతో ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

వీఆర్వోను అరెస్టు చేయాలి



ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

బొబ్బిలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పారాది గ్రామానికి చెందిన నగర పోలమ్మ అనే దళిత మహిళను కులంపేరుతో దూషించి అవమానించిన వీఆర్వో అడపా గౌరీశంకర్‌ను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టాయి. శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ముందు సీపీఐ, దళిత హక్కుల పోరాట సమితి, ఎంఆర్‌పీఎస్ నాయకులు కోట అప్పన్న, గర్బాపు రమేష్, పిల్లి శంకరరావు, కన్నారావు, హరిబాబు, శంకరరావుల ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. పట్టాదారు పుస్తకం అడిగిన నేరానికి దళిత మహిళను దూషించడం క్షమించరానిదన్నారు. ఆయనపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన అక్రమాస్తులపై ఏసీబీ దర్యాప్తు నిర్వహించాలని, వీఆర్వోను సస్పెండ్ చేయాలని వారంతా డిమాండ్ చేశారు.

మా భూములు కాపాడండి

● కాశిందొరవలస గ్రామస్థుల ఆందోళన



డీటీకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

బొబ్బిలి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తమ భూములు కాపాడాలని కోరుతూ కాశిందొరవలస గ్రామస్థులు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ డీకేవీ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్టీ, బీసీ కులాలకు చెందిన నిరుపేద కుటుంబాలు కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం మంజూరు చేసిన ఎల్‌సీసీ పట్టా భూములను సాగు చేసుకుంటున్నామని చెప్పారు. అయితే ఇటీవల కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు తమ భూములకు ఆనుకుని గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. తాము అడ్డుకోగా సంబంధం లేని సమాధానాలు ఇస్తున్నారని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాటుపడతారోనని భయంగా ఉందన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి వారిని అక్కడ నుంచి తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి

బొబ్బిలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 3, 4, 7, 9, 16, 18, 21, 22, 23 వార్డులలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) డే కార్యక్రమాలను నిర్వహించారు. పీవో జె.విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ● బొబ్బిలి రూరల్: మండలంలోని రంగరాయపురం, చెల్లారపువలస అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం పూర్వ బాల్య దశ సంరక్షణ విద్య (ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

భూదేవికి అభ్యుదయ రైతు అవార్డు

పాలకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీ, రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలు, అభ్యుదయ రైతుల అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సంబరాల్లో నారీశక్తి రాష్ట్రపతి అవార్డు గ్రహీత పడాల భూదేవికి అభ్యుదయ రైతు అవార్డు ప్రదానం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, విజ్ఞాన్ చైర్మన్ రత్తయ్య చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు.

రైతు సమస్యలపై 9న సమావేశం

పాలకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భామిని మండలంలో ఈనెల 9న రైతు సమస్యలపై నిర్వహించనున్న విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు నారు జనార్ధనరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కొండాపురం గ్రామంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. కిమిడి రామ్మూర్తినాయుడు, బలగ దుర్గారావు, సన్యాసినాయుడు, బచ్చల పారినాయుడు, బలగ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

సీతానగరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో సంకల్ప పథకంలో భాగంగా మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం ఆర్.శ్రీరాములు పర్యవేక్షణలో రెండో రోజు శనివారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు కొనసాగింది. జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి కె.సాయికృష్ణ చైతన్య వ్యాపార అవకాశాలపై అవగాహన కల్పించారు. 30 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.

తల్లికి వందనం అమలు చేయాలి

పాలకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. శనివారం పాలకొండలోని తన స్వగృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లికి వందనం పథకాన్ని వర్తింప చేయాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, వంగర జడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శనరావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎథినిక్ డే



సంప్రదాయ వేషధారణలో చిన్నారులు

బొబ్బిలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనిధి పాఠశాలలో శనివారం ఎథినిక్ డే ఉత్సవాలను వినూత్న తరహాలో నిర్వహించారు. కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు ఆధ్వర్యంలో చిన్నారులంతా పలు రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ వేషధారణలతో ప్రదర్శనలు ఇచ్చారు. తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సాలూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మోటారు రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో కార్మికులతో సదస్సు నిర్వహించారు. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌వై నాయుడు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

గోకులం పనుల పరిశీలన

సీతంపేట రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముకుందాపురం, ఈత మానుగూడ, దారపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న గోకులం పనులను పలువురు అధికారులు శనివారం పరిశీలించారు. ఏపీవో విద్యాసాగర్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ ధర్మారావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ సందర్శించారు. మండలంలో 17 గోకులాలు మంజూరయ్యాయని చెప్పారు.

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

పార్వతీపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కోడా చలపతిరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 7, 8, 10 తేదీల్లో మూడు రోజుల పాటు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని చెప్పారు. ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడ బృందావన కాలనీ ఏ కన్వెన్షన్ సెంటర్ నుంచి ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని తెలిపారు. 10న కర్నూలు కమిషన్ ఆఫీస్ నుంచి ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష హాజరు ద్వారా, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయ సేకరణ నిర్వహిస్తారని చెప్పారు.

యూత్ ఫెస్టివల్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కొమరాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఉయ్యాల దిలీప్, పాలక ఉదయ్‌కిరణ్‌లు జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన జిల్లా యూత్ ఫెస్టివల్ పోటీలలో ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. సెన్సార్‌తో పని చేసిన ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ ప్రాజెక్టుకు ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు. వీరిని జిల్లా అధికారులు రూ.5వేలతో పాటు సర్టిఫికెట్‌తో సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ అధికారి రఘుకుమార్

గరుగుబిల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారుల ఆరోగ్యంపై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ అధికారి డా.రఘుకుమార్ సూచించారు. ఉల్లిభద్ర అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలన్నారు. అలాగే సచివాలయాల పరిధిలోని వెల్‌నెస్ కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ పరిశీలనలో గరుగుబిల్లి వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

